
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
సోమవారం 8 జనవరి 2024

కడపలో మొదటి బహుమతి పొందిన ముగ్గు



రాజంపేటలో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



చుక్కలన్నీ ముగ్గులై..



రాయచోటిలో ముత్యాల ముగ్గులు వేస్తున్న దృశ్యం

సంక్రాంతి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి 2005 నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ వస్తోంది. కరోనా సమయంలో విరామం ప్రకటించడం మినహా నాటి నుంచి క్రమం తప్పకుండా మహిళలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే. ఆ క్రమంలో ఆదివారం కడప, రాయచోటి, రాజంపేట పట్టణాలలో ముగ్గుల పోటీలను నిర్వహించింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' సౌజన్యంతో పై తెలిపిన మూడు ప్రాంతాలలో జరిగాయి.

రాయచోటిలో..

రాయచోటి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఆదివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు అట్టహాసంగా జరిగాయి. రాయచోటి పట్టణానికి చెందిన రాజు విద్యాసంస్థల సహకారంతో రాజంపేట ఒలంపియాడ్ పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. గృహిణులు, ఉద్యోగినులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాలకు చెందిన 111 మంది మహిళలు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు మొదలైన ఈ పోటీలు మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. ఈ ముగ్గుల పోటీకి న్యాయనిర్ణేతలుగా ప్రశాంతి, తేజ, రాధ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఈ ముగ్గుల పోటీలు జరగడం సంతోషకరమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రాబోయే తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల విలువ తెలుస్తుందన్నారు.

అనంతరం సీఐ, అతిథుల చేతుల మీదుగా ప్రథమ బహుమతి విజేత భవానీకి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి అమరావతికి రూ.4 వేలు, తృతీయ బహుమతి హిమబిందుకు రూ.3 వేలతో పాటు మెమెంటో, శాలువాతో సత్కరించారు. న్యాయనిర్ణేతలను కూడా మెమెంటో, శాలువాతో సత్కరించారు. అదే విధంగా పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహకంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అన్నమయ్య బ్యూరో ఇన్‌చార్జ్ గౌనిపల్లె శ్రీనివాసులు, రాజు విద్యాసంస్థల సీఈవోలు సదాశివరెడ్డి, లలిత, వెంకట్రామరాజు, రమేష్‌రెడ్డి, ఉమా, గోపీకృష్ణ, రాధలతో పాటు విద్యాసంస్థలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

- అబ్బురపరచిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి రంగవల్లులు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళామణులు
- సంప్రదాయాలకు పెద్దపీట వేయడం ఆంధ్రజ్యోతి సొంతం

రాజంపేట, జనవరి 7: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రాజంపేటలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. మహిళలు భారీగా తరలివచ్చి రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ కార్యనిర్వాహకులు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్ రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తమ శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో గత ఐదేళ్లుగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రజ్యోతి కడప యూనిట్ ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి మాట్లాడుతూ ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అపూర్వ స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దడం చూస్తుంటే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్లుందని తెలిపారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదు సంవత్సరాలుగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం, ఈ పోటీలకు శరత్‌కుమార్‌రాజు అన్ని విధాలా ప్రోత్సహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన నెల్లూరు జిల్లా పొదలకూరుకు చెందిన బి.లక్ష్మీదేవి రూ.6 వేలు, ద్వితీయ బహుమతిని ప్రొద్దుటూరుకు చెందిన సుమలతకు రూ.4 వేలు, తృతీయ బహుమతిని నందలూరుకు చెందిన వి.బుజ్జమ్మ రూ.3 వేలు అందచేశారు. వీరికి శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఆయన తనయుడు కొండూరు భరత్‌కుమార్‌రాజు, సీఈవో శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల అందజేసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. ఈ పోటీలకు రాజంపేట, నందలూరు, నెల్లూరు, ప్రొద్దుటూరు, కోడూరు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీ న్యాయ నిర్ణేతలుగా రేణుకమ్మ, విజయనిర్మల, శివమ్మలు వ్యవహరించారు. కార్యక్రమంలో రాజంపేట ఆంధ్రజ్యోతి రీజనల్ ఇన్‌చార్జి ఎం.రామచంద్రయ్య, ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కేశవరావు, నీటిపారుదల శాఖ రిటైర్డ్ డివిజనల్ ఇంజనీర్ రమేష్‌చంద్ర, రిటైర్డ్ రైల్వేస్టేషన్ మాస్టర్ సత్యనారాయణరాజు, కొండూరు సుగుణ, కృష్ణవేణమ్మ, అరుణ, వ్యాఖ్యాతగా సంపూర్ణకుమారి, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జి ప్రభాకర్, ఉపాధ్యాయులు శివనీల పాల్గొన్నారు.



రాజంపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



కడప ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన శ్వేతకు బహుమతి అందచేస్తున్న వికాస్ విద్యా సంస్థల చైర్మన్ సరస్వతమ్మ, కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య, ఆంధ్రజ్యోతి కడప బ్యూరో ఇన్‌చార్జ్ ఆంజనేయులు తదితరులు

కడపలో..

కడప (కల్చరల్) జనవరి 7: కడపలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలు వికాస్ విద్యాసంస్థల సౌజన్యంతో ఐటీఐ సర్కిల్ సమీపంలోని వికాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జరిగాయి. కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్ సరస్వతమ్మ హాజరై మాట్లాడారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు తాను సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రజ్యోతి కడప యూనిట్ బ్రాంచ్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య మాట్లాడుతూ 2005 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, మధ్యలో కరోనా సమయంలో కాస్త విరామమిచ్చామన్నారు. ముగ్గుల పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముగ్గుల పోటీలు స్పాన్సర్‌గా వ్యవహరించిన వికాస్ ఇంగ్లీషు మీడియం కరస్పాండెంట్‌కు వికాస్ హరిక్రిష్ణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు వికాస్ హైస్కూల్ చైర్మన్ సరస్వతమ్మ, కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ, ఆంధ్రజ్యోతి సిబ్బందితో కలిసి విజేతలకు బహుమతులు అందచేశారు. పోటీల్లో ప్రథమ విజేత కడపకు శ్వేతకు రూ.6 వేలు, ద్వితీయ విజేత ప్రొద్దుటూరుకు చెందిన రమాదేవికి రూ.4 వేలు, తృతీయ విజేత ప్రొద్దుటూరుకు చెందిన సునీతకు రూ.3 వేలు నగదు అందచేశారు. వీరితో పాటు 10 మందికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా సరస్వతమ్మతో పాటు ఇందిర, స్వర్ణలత వ్యవహరించారు.



కడపలో ముగ్గులు వేస్తున్న మహిళలు



రాయచోటిలో మొదటి బహుమతి పొందిన భవానీకి బహుమతి అందజేస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి అన్నమయ్య జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ గౌనిపల్లె శ్రీనివాసులు, తదితరులు



రాయచోటి ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



రాజంపేట ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేత లక్ష్మీదేవికి బహుమతి ప్రదానం చేస్తున్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు భరత్ కుమార్‌రాజు, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, రాజంపేట ఆంధ్రజ్యోతి రీజనల్ ఇన్‌చార్జి ముదాం రామచంద్రయ్య, తదితరులు

గిడ్డంగివారిపల్లె చెరువులో రూ.100 కోట్ల అవినీతి

- జడ్పీటీసీ, ఎంపీకి లాభం చేకూర్చారు
- అవినీతికి సహకరించిన ఇంజనీర్లు జైలుకెళ్లడం ఖాయం
- బ్రదర్ అనిల్‌ను కలవడం యాదృచ్ఛికమే
- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

వేంపల్లె, జనవరి 7: మండలంలోని గిడ్డంగివారిపల్లె చెరువు (రిజర్వాయర్) నిర్మాణంలో రూ.100కోట్ల అవినీతి జరిగిందని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆరోపించారు. స్థానిక జడ్పీటీసీ, ఎంపీకి చెరో రూ.50 కోట్ల లాభం చేకూర్చారని ఆయన తెలిపారు. అవినీతికి సహకరించిన ఇంజనీర్లు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. వేంపల్లెలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ మారుతున్న వారిపై కక్షగట్టి కేసులు పెట్టించడం వైసీపీకి అలవాటుగా మారిందన్నారు. వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణ తొలగింపు పనులకు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరయ్యాయని, ఇందులో గోల్‌మాల్ జరిగిందన్నారు. గిడ్డంగివారిపల్లె చెరువు నిర్మాణ పనులకు సంబంధించి లాభం చేకూర్చేందుకు బిల్లులు అడ్జస్ట్ చేయడం వంటి వాటిని వెలికితీసి చర్యలు తీసుకుంటామన్నారు. బ్రదర్ అనిల్‌ను కడప ఎయిర్‌పోర్టులో కలవడం యాదృచ్ఛికంగా జరిగిందన్నారు. కాంగ్రెస్‌లో విలీనం విషయంపై మాటామంతి జరిగిందని.. వైసీపీ నాయకులు వక్రీకరించి వారికి అనుకూలంగా మాట్లాడుకోవడం వారి నైజానికి నిదర్శనమన్నారు. బ్రదర్ అనిల్ కుటుంబ సభ్యులు, నేను ఇద్దరం జగన్ బాధితులమే అని.. ఆయనతో మాట్లాడే వ్యవహారం బాబు స్కెచ్ అని చెప్పడం హాస్యాస్పదమన్నారు.



వేంపల్లెలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

అంగన్వాడీలను అత్యవసర విధుల కిందకు చేర్చి జారీ చేసిన జీవో నెం.2 ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం



మైదుకూరులో అమ్మవారికి బోనాలతో అంగన్వాడీల నిరసన



ఎస్మాకు భయపడం

- హామీ ఇచ్చి మోసం చేస్తారా?
- జగన్ సర్కారుపై అంగన్వాడీల ఆగ్రహం
- అసెంబ్లీ సాక్షిగా ప్రేమ చూపించి.. సీఎం అయ్యాక మాట తప్పుతావా..?
- మున్సిపల్ కార్మికుల ఆగ్రహం

(కడప-ఆంధ్రజ్యోతి): మాట తప్పను మడమ తిప్పను.. ఇచ్చిన మాట మీద ఉంటానని ప్రతిపక్ష నేత హోదాలో పెద్దపెద్ద స్లోగన్స్ చెప్పావు. నీ మాటలు నమ్మి మా కుటుంబ ఓట్లతో పాటు మిగతా వారి ఓట్లను వేయించాం. నీవు సీఎం అయితే ఇచ్చిన హామీలు అమలు చేసి సమస్యలు పరిష్కరిస్తావని ఆనందించాం. అందుకు తగ్గట్లుగానే ఓట్లు వేశాం, మీరు సీఎం అయ్యారు. మాట తప్పరు మడమ తిప్పరనుకున్నాం. అయితే మా గోడు పట్టించుకోకుండా..మాపై ఎస్మా చట్టం ప్రకటిస్తావా.... అంటూ సీఎం జగన్ పై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ప్రయోగించిన ఎస్మాకు మేం ఎంత మాత్రం భయపడమని, సుప్రీంకోర్టు ఆదేశాలు, ఇచ్చిన హామీలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు.

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరుకుంది. ఆదివారం నిరసనలు, ధర్నాలు దీక్షలు చేశారు. కడపలో అంగన్వాడీలకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి మద్దతు తెలిపారు. పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలులో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.2 ప్రతులను దహనం చేశారు. మైదుకూరులో బోనాలతో నిరసన తెలిపారు. చాపాడు, ఎర్రగుంట్లలో నిరసన కొనసాగించారు. ఇక 13వ రోజు ఆదివారం కడపలో మున్సిపల్ కార్మికులు ఒంటికాలిపై జపం చేసి నిరసన తెలిపారు. ఎర్రగుంట్లలో ధర్నా నిర్వహించారు. బద్వేలులో మానవహారం చేపట్టారు.



కడపలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న దృశ్యం



ఎర్రగుంట్లలో బైఠాయించిన పారిశుధ్య కార్మికులు

ఇదెక్కడి విడ్డూరం..

- సాధికార యాత్ర కోసం చెట్లు నరికివేత
- మండిపడుతున్న ప్రజలు

బద్వేలు టౌన్, జనవరి 7 : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా ఆ ప్రాంతాల్లో చెట్లను కొట్టేసి పరదాలు కడుతూ వస్తున్నారు. దీన్ని ఆ పార్టీ నేతలు వంటబట్టిచ్చుకున్నారో ఏమో కానీ... ఇప్పుడు సామాజిక సాధికారయాత్ర పేరుతో పచ్చని చెట్లను నరికివేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నాటిన చెట్లను ఇలా నిర్దాక్షిణ్యంగా నరికివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

బద్వేలు పట్టణంలో సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోరుమామిళ్ల రోడ్డులోని పోలీసుస్టేషన్ ప్రహరీగోడ సమీపంలో ఉన్న వేపచెట్లను నరికివేశారు. ఎన్నో సంవత్సరాల క్రితం పోలీసుశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు మొక్కలు నాటి సంరక్షిస్తే.. కొన్ని గంటల పాటు నిర్వహించే సమావేశానికి పచ్చని చెట్లను నరికివేయడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇది వైసీపీ దురహంకారానికి నిదర్శనం అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు.



పోలీసుస్టేషన్ ఆవరణలోని చెట్లను నరికివేస్తున్న దృశ్యం

టీడీపీతోనే బంగారు భవిష్యత్తు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 7 : టీడీపీతోనే రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కడప నగరం 15వ డివిజన్ ఫరీదానగర్ ఆంజనేయస్వామి గుడి నుంచి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అబివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అచారక పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ వైసీపీ పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


టీడీపీ, జనసేన నాయకులకు మంగళహారతి పడుతూ స్వాగతిస్తున్న స్థానికులు

ఆంధ్రుల జీవితాల్లో వెలుగు చంద్రన్నతోనే సాధ్యం: టీడీపీ


ముండ్లపల్లెలో బాబుతో భవిష్యత్తు గ్యారంటీలో నేతలు

చెన్నూరు, జనవరి 7 : ఆంధ్రుల జీవితాల్లో వెలుగు రావాలంటే చంద్రన్నతోనే సాధ్యమని టీడీపీ అధికార ప్రతినిధి, బలిజ సంఘం నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం పేర్కొన్నారు. చెన్నూరు, ముండ్లపల్లె గ్రామాల్లో ఆదివారం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికార ప్రతినిధి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులపాలు చేసి రష్ట్రాన్నే అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. రాష్ట్రం కోలువాలంటే మళ్లీ దూరదృష్టి గల నేత, పరిపాలనాదక్షుడు ఒక్క చంద్రబాబుతో సాధ్యమన్నారు. ప్రజలు ఇందుకోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఎలాంటి అభివృద్ధి ఫలాలు, పథకాలు, సంక్షేమ పథకాలు అందిస్తారో ప్రజలకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలను టీడీపీ మేనిఫెస్టోలో చేర్చుతారని, అవి పార్టీ అధికారంలోకి రాగానే ఇంటింటికీ అందిస్తామన్నారు. అంతేకాక పేదవర్గాలు బాగుపడేందుకు గతంలో ఉన్న సబ్సిడీ రుణాలు, బడుగు బలహీన వర్గాలు ఉపాధి పొందే ఆదరణ పనిముట్లు వైసీపీ ప్రభుత్వంలో లేవని, ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమవుతాయన్నారు. అందుకే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత క్రిష్ణకాంత్, ముండ్లపల్లె టీడీపీ నేతలు అల్లాడు రాజశేఖర్, యామల మణికంఠ, షేక్ అబ్దుల్లా, బీసీ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆటోబాబు, కుందేటి క్రిష్ణయ్య, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓబులంపల్లెలో...

మండలంలోని ఓబులంపల్లెలో ఆదివారం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే పనులు, అందించబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ నేతలు రఘునాథరెడ్డి, ముండ్ల లక్ష్మిరెడ్డి, వై.నాగరాజు, తిలక్, సోమా సంజీవయ్య, వై.మణికంఠ పాల్గొన్నారు

సంక్షేమానికి మారుపేరు టీడీపీ

● టీడీపీలో 100 కుటుంబాలు చేరిక

● రానున్నది చంద్రన్న ప్రభుత్వమే: పుత్తా


పుత్తా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారు

సీకేదిన్నె, జనవరి 7: సంక్షేమానికి మారుపేరు టీడీపీ అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సీకేదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన 17వ డివిజన్ సోమళ్లపల్లెలో ఇన్‌చార్జ్ మునీంద్ర యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 100 కుటుం బాలు టీడీపీలోకి చేరారు.

ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. సమగ్రాభి వృద్ధి చంద్రబాబుకే సాధ్యమన్నారు. ప్రధానంగా మహిళల కోసం చంద్ర బాబు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. అందులో భాగంగానే ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.1 లక్ష పెళ్లి కానుక తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, ఏటూరి రామచంద్రారెడ్డి, డీవీ సుబ్బారెడ్డి, నరసింహులు యాదవ్, శివశంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీని ఆదరించండి
బీటెక్ రవి

పులివెందుల, జనవరి/వేంపల్లె 7: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని తొండూరు మండలంలోని అగడూరు గ్రామంలో టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. తొండూరు మండల పరిశీలకుడు జయభరత్‌రెడ్డి, జోగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవితేజరెడ్డి, మండల ఇన్‌చార్జి శివమోహన్‌రెడ్డి, నాయకులు మారుతిదేశాయ్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, మారుతి యాదవ్, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో వలసలు పెరుగుతాయి

టీడీపీలోకి రాబోవు రోజుల్లో వలసలు పరుగుతాని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో ఆదివారం పార్టీ కార్యాలయంలో వైసీపీ నుంచి గండిమాజీ చైర్మన్ రమణ, రెడ్డి కిషోర్, గౌస్‌బాష, ఖాసీం, చెంద్రాయుడు తదితర కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కండువా వేసి వారిని ఆహ్వానించారు. భవిష్యత్తు టీడీపీదేనని, అందుకే వైసీపీ నుంచి వలస వస్తున్నారని ఆయన తెలిపారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, పట్టణ అధ్యక్షులు ఆర్వీ రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, జగన్నాథరెడ్డి, మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ దర్బార్ తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లెలో బీటెక్ రవి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న గండి మాజీ చైర్మన్ రమణ తదితరులు

ఘనంగా కందుల రాజేశ్వరమ్మ పుట్టినరోజు వేడుకలు



కందుల గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాని, తదితరులు

సీకేదిన్నె, జనవరి 7 : కందుల గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కోశాధికారి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ 70వ జన్మదిన వేడుకలు కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహిం చారు. అనంతరం కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుళ్‌రెడ్డి (నాని) తన మాతృ మూర్తి పుట్టినరోజును పురస్కరించుకొని కలి యుగం పట్టణం సినిమాలోని 'జోజో.. లాలి అమ్మ' అనే పాట ప్రోమో ఆడియోను ఓపన్ ఆడి టోరియంలో విద్యార్థుల మధ్య వారికి అంకితం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలంరింప జేశాయి. కార్యక్రమంలో కళాశాల ఎండీ చిత్ర నిర్మాత కందుల చంద్రఓబుళ్‌రెడ్డి (నాని), చిత్ర దర్శకుడు రమా కాంత్‌రెడ్డి, చిత్ర యూనిట్, కేఓఆర్ఎం కళాశాల చైర్మన్ వెంకటశివారెడ్డి, సెక్రటరి లిఖితారెడ్డి, కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం కళాశాల ప్రిన్సిపాల్ రత్నమ్మ, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 7 : సంబటూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన వీక్షిత్ భారత్ ప్రోగ్రాంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జ్యోతి, ఈవోపీఆర్‌డి శారద, డీడీవో యాకుబ్ అధికారులు బీజేపీ నాయకులు బాలక్రిష్ణయాదవ్, సురేష్ కుమార్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ కన్వీనర్ గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు


భోగి సందర్భంగా నృత్యం చేస్తున్న వైవీయూ విద్యార్థులు

కడ ప (ఎడ్యుకేషన్), జనవరి 7 :నేటి ఆధునిక యుగంలో పండుగలంటే ఒక రోజు సెలవు దినం అని భావించే కంప్యూటర్ యుగానికి ఆదునిక పోకడలతో కను మరుగవుతున్న సంప్రదాయాలను సరి కొత్తగా పరిచయం చేస్తూ అంబరానికి తాకేలా సంబరాలను వైవీయూ వాణిజ్య శాఖ జరుపుకుంది. వైవీయూ యువకులకు గ్రామీణ సంప్రదాయాలను నాటి ఆ చారవ్య వహారాలను పరిచయం చేస్తూ వేడుకలను నిర్వహించారు. ఉట్టికొట్టే సంప్రదాయం పండుగ, గాలిపటాలను ఎగుర వేయడం, ముగ్గులను వేస్తూ హరిదాసుల సంకీర్తనలతో విశ్వవిద్యాలయ ప్రాంగణం మా ర్మోగింది. వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ వాణిజ్య శాఖను అభినందించారు. డాక్టర్ రఘునాథరెడ్డి, దూర విద్య డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు.

అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణం

● రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వివిధ పార్టీల నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 7:శాంతియుతంగా పోరాడుతున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.2 ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణమని, విరమించుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అఖిలపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఏ సత్తార్, జనసేన నాయకులు సుంకర శ్రీనివాస్, ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు జి.లక్ష్మిరెడ్డి, హరిసాద్, గురప్ప, లోక్‌సత్తా క్రిష్ణ, మహిళా సమాఖ్య బషీరున్నీసా, వ్యవసాయ, కార్మిక సంఘం నేతలు సుబ్రమణ్యం, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కేసీ బాదుల్లా, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునెయ్య, సీపీఎం నాయకులు డీఎం ఓబులేసులు మాట్లాడారు.

ప్రభుత్వం తక్షణం ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలి: పీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), జనవరి 7 : రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని అమలు చేసిందని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. ప్రభుత్వం తక్షణం ఈ చట్టాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం పీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 26 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, 13 రోజులుగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నరన్నారు. వారితో చర్చించి వారి హక్కులను పరిష్కరించాల్సింది పోయి ఉద్యమాలను అణచివేసే విధంగా ఎస్మాచట్టం ప్రయోగించడం అన్యయమన్నారు. తక్షణం ఈ చట్టాన్ని ఎత్తివేయాలని కోరారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

● 8గంటలకే కార్మికులంతా కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 7 :కార్మికులతో చర్చలు విఫలమయ్యాయని ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కార్మికుల సంఘం నేతలు తెలిపారు. కార్మికులంతా సోమవారం ఉదయం 8గంటలకు కలెక్టరు కార్యాలయం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి తమ నిరసన తెలిపారు.. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు సాయి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక నాయకులతో జరిపిన చర్చల్లో మున్సిపల్ సమ్మెను చాలా తక్కువగా చూస్తున్నారన్నారు.

నాలుగున్నర సంవత్సరాల కాలంలో ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ జీతాలు మాత్రం ఏ మాత్రం పెరగలేదన్నారు. కనీసం రెండు పూటలా భోజనం తినగలిగితే కష్టమైన పనిచేయగలమని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదని ఈ నేపథ్యంలో సోమవారం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక నాయకడు సుంకర రవి మాట్లాడుతూ కడప కలెక్టరేట్ ఎదుట సోమవారం మున్సిపల్ కార్మికుల ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఉదయం 8గంటలకే కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని తమ సత్తా ఏంటో నిరూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు, తిరుపాల్, శ్రీరామ్, శివ, రమేష్, నాగరాజ్, ఆదాం, దస్తగిరమ్మ, దరణి, కొండమ్మ, లక్ష్మితో పాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జనవరి 7: పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అర్బన్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పార్నపల్లె రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న సందర్భంగా పార్నపల్లె రోడ్డు ఏరియా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీల సత్తా చూపిస్తాం: అవ్వారు

కడప (మారుతీనగర్), జనవరి 7: వచ్చే ఎన్నికల్లో బీసీల సత్తా చూపిస్తామని జాతీ య చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అ వ్వారు మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం గుంటూ రు లో తొగట వీరక్షత్రియ సం ఘం కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. పలు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు తమ పార్టీ తరఫున అభ్యర్థులను ఇతర పార్టీల కంటే ముందే ప్రకటించినట్లు వెల్లడించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి టీడీపీ కట్టుబడి ఉంది

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 7 : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి టీడీపీ కట్టుబడి ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ ఆడిటోరియంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన 9వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ముందుగా ఆర్ఎస్‌యూ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉందని, అభివృద్ధి చేయడంలో అన్నిరంగాల్లో ఈ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. టీడీపీ విద్యార్థులు, యువతకు, నిరుద్యోగులకు అన్ని విధాలుగా తోడు ఉంటామని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్నిశాఖల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఐదుసంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో రాష్ట్రం వెనుకబడి ఉందని దీనికి కారణం ముఖ్యమంత్రి చేతగానితనమన్నారు. ఆర్ఎస్‌యు నాయకత్వం చేస్తున్న ప్రతి పోరాటానికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఆర్ఎస్‌యు రాష్ట్రఅధ్యక్షులు రవిశంకరరెడ్డి మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎస్‌యు నాయకత్వం పాల్గొన్నారన్నారు. ఈ సంవత్సరం పాటు జరిగిన పోరాటాలపై చర్చించడం జరిగిందన్నారు. దీనిపై పలు తీర్మానాలు చేసి భవిష్యత్తులో కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, ప్రశాంత్,, క్రిష్ణారెడ్డి, రాజు, నాగరాజు, అవినాశ్, మునిరెడ్డి, చరణ్, మణికంఠ, చెన్నకేశవరెడ్డి, హరి, సుమంత్, రోహిత్ పాల్గొన్నారు.

మద్యంతర భృతి కల్పించాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 7: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఆర్ జే యూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఆర్‌జేయూపీ టీచర్స్ హోంలో జిల్లా అధ్యక్షుడు ఎ.ప్రసాదరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 2023 నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. ఆరు నెలల కిందట జూలై 2023న పీఆర్సీ కమిషన్‌ను నియమించినా ఇప్పటి వరకు ఆ కమిటీ ఏ కార్యక్రమం చేపట్టలేదని తెలిపారు. గత పీఆర్సీలో కూడా ఏ మాత్రం ఉద్యోగులకు న్యాయం జరగలేదని ఈ పీఆర్సీలో అయినా న్యాయం ఏయాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగులో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, సరెండరు లీవు, కరవు భత్యం బకాయలతో కలిపి ఆర్థిక బకాయలన్నీ సెప్టెంబరు 23లోపు చెల్లిస్తామని ,చెప్పిన ప్రభుత్వం నేటికీ చెల్లించలేదన్నారు. తక్షణం ఈ ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెయుపి నాయకులు బా లాజీ, ఆంజనేయులు, బండారు రాజగోపాల్, వెంకట సుబ్బయ్య, పసుపులేటి అనసూయదేవి, వీరన్న పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్‌లో నయా జోష్

● బ్రదర్ అనిల్‌ను కలిసిన శ్రీనివాసరెడ్డి



పులివెందుల టౌన్, జనవరి 7: వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి రావడంతో కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ వచ్చిందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం బ్రదర్ అనిల్‌ను శ్రీనివాసరెడ్డి కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై కడప జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలాబలాల గురించి ఆయనకు వివరించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.


సి.రామచంద్రయ్యకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న శ్రీనివాస విద్యాసంస్థల చైర్మన్ బి.శ్రీనివాసులు

మురిసిన ముత్యాల ముగ్గులు

ఉత్సాహంగా సాగిన పోటీలు ● సంప్రదాయాలకు నెలవు ● పోటీలకు విశేష స్పందన



కడపలో ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



కడపలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్‌మేనేజర్ అబ్బిగారి నరసయ్య నుంచి రెండో బహుమతి అందుకుంటున్న రమాదేవి - రాయచోటిలో రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి నుంచి రెండో బహుమతి అందుకుంటున్న అమరావతి - రాజంపేటలో కొండూరు భరత్‌కుమార్‌రాజు నుంచి రెండో బహుమతి అందుకుంటున్న స్వర్ణలత

కడప (కల్చరల్) జనవరి 7: నింగిలోని చుక్కలే భువిపై ముత్యాల ముగ్గులై విరిశాయని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు విలువిస్తూ సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి 2005 నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట, రాయచోటిలో ముగ్గుల పోటీలను చేపట్టింది. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాలముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, సౌజన్యంతో పోటీలు జరిగాయి. కడపలో స్థానిక ఐటీఐ సమీప వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్), రాజంపేటలో శాన్వీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో పోటీలు ఏర్పాటు చేశారు. సరిగ్గా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించిన పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున హాజరై రంగవళ్లులను తీర్చిదిద్దారు. కడపలో నిర్వహించిన పోటీలకు ప్రొద్దుటూరు, కడప, బద్వేలు, వల్లూరు, కమలాపురం, రాయచోటిలో నిర్వహించిన పోటీలకు చుట్టుపక్కల ప్రాంతాలు సహా బయటి ప్రాంతీయులు, రాజంపేటలో నిర్వహించే పోటీలకు రాజంపేట, నందలూరు, నెల్లూరు, ప్రొద్దుటూరు, కోడూరు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఉదయం 9 గంటల నుంచే వేదికలు వద్ద తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కడపలో సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నారు. రాయచోటిలో 111 మంది, రాజంపేటలో వంద మంది పైచిలుకు మహిళలు పాల్గొన్నారు. కడపలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ముఖ్య అతిథి వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్ సరస్వతమ్మ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. గెలుపోటములు సాధారణమని, విజేతలెవరన్నది ప్రధానం కాదని ప్రతిభ ఏపాటిదో తెలుసుకునే ఒక మంచి వేదిక కల్పించిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వివిధ రూపాల్లో మంచి మంచి ముగ్గులు వేసిన ప్రతి మహిళా ప్రతిభావంతురాలే అని ఈ రోజు విజేత కాని వారు వచ్చే ఏడాది విజేతగా నిలిచేలా మరింత పట్టుదలతో రాణించాలన్నారు. వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ మహిళలు చాలా మంచిగా ముగ్గులువేశారని, అందు నుంచి ముగ్గురిని నిష్పక్షపాతంగా న్యాయనిర్ణేతలు ఎంపికచేశారన్నారు. చుక్కలు, సంప్రదాయం, ముగ్గు తాలూకు ఔట్‌లుక్‌ను బేరీజు వేసుకుని విజేతలను ప్రకటించారన్నారు. ఆంధ్రజ్యోతి యూనిట్ మేనేజర్ అబ్బిగారి నరసయ్య మాట్లాడుతూ 2005 నుంచీ క్రమం తప్పకుండా ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4 వేలు, తృతీయ విజేతకు రూ. 3 వేలు నగదు బహుమతులు, మరో పది మందికి కన్సొలేషన్ బహుమతులు అందించామన్నారు.

మొదటి విజేతగా శ్వేత

ముగ్గుల పోటీల్లో ప్రథమ విజేతగా కడప శంకరాపురం వాసి శ్వేత నిలవగా ద్వితీయ విజేతగా ప్రొద్దుటూరుకు చెందిన రమాదేవి, తృతీయ విజేతగా సునీత నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికి ఒక్కోచీర అందజేశారు. కాగా పోటీల్లో పాల్గొన్న మిగతా వారందరికీ ప్రత్యేక బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సరస్వతమ్మతో పాటుగా ఇందిర, స్వర్ణలత వ్యవహరించారు. కార్యక్రమంలో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

మరిచిపోలేని అనుభూతి



రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో తాను నెల్లూరు జిల్లా పొదలకూరు నుంచి సుదీర్ఘ ఘాట్ రోడ్డు గుండా రాజంపేటకు వచ్చి ఈ పోటీల్లో మూడేళ్లగా పాల్గొంటున్నా. ఏటా ఏదో ఒక బహుమతి లభిస్తోందని, ఈ ఏడాది ప్రథమ విజేతగా తాను ఎన్నికవడం మరిచిపోలేని అనుభూతన్నారు.

మొదటి విజేత లక్ష్మీదేవి



ఎంతో సంతోషాన్నిచ్చింది



శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొని రెండవ విజేతగా నిలవడం తనకెంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు.

సుమలత, ద్వితీయ విజేత

సృజనాత్మకతను వెలికి తీయవచ్చు



మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చు. ఇటువంటి పోటీలు నిర్వహించి మహిళలను చైతన్యం తీసుకురావచ్చన్నారు. ఇది ఎంతో అభినందనీయమన్నారు.

బుజ్జమ్మ, తృతీయ విజేత

రాజంపేటలో విశేష స్పందన

రాజంపేట, జనవరి7: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో బయటి జిల్లా వాసులు సైతం పాల్గొన్నారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వారి తనయుడు కొండూరు భరత్‌కుమార్‌రాజు, సీఈఓ శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రేణుకమ్మ, విజయనిర్మల, శివమ్మ వ్యవహరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సువిశాల శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు

ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవని ముగ్గుల పోటీ కార్యనిర్వాహకులు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు కొండూరు శరత్‌కుమార్ రాజు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏటా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఆంధ్రజ్యోతి కడప యూనిట్ ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి మాట్లాడుతూ శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదేళ్లగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం, శరత్‌కుమార్‌రాజు ప్రోత్సహించడం పట్ల అభినందనలు తెలియజేశారు.

రాయచోటి పోటీకి మహిళల స్పందన

రాయచోటి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎబిఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో ముగ్గులు ఆకర్షణీయంగా ఉన్నాయి. న్యాయనిర్ణేతలుగా ప్రశాంతి, తేజ, రాధ వ్యవహరించారు. ప్రథమ బహుమతిని రాయచోటికి చెందిన భవాని, ద్వితీయ బహుమతి అమరావతి, తృతీయ బహుమతిని హిమబిందు గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాజు విద్యాసంస్థల సీఈఓలు సదాశివరెడ్డి, లలిత, వెంకట్రామరాజు, రమేష్‌రెడ్డి, ఉమా, గోపీకృష్ణ, రాధ, విద్యాసంస్థల సిబ్బంది హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి అన్నమయ్య బ్యూరో గౌనిపల్లె శ్రీనివాసులు, రాయచోటి రిపోర్టర్లు పి.వి నాగయ్య, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, మోహన్, తిరుపాల్‌నాయక్, రామయ్య, దేవరాజ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కడపలో అతిథుల నుంచి మూడో బహుమతి అందుకుంటున్న సునీత - రాయచోటిలో తృతీయ బహుమతి అందుకుంటున్న హిమబిందు - రాజంపేటలో మూడో బహుమతి అందుకుంటున్న వి.బుజ్జమ్మ

పదేళ్లగా పాల్గొంటున్నా



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో సుమారు పదేళ్లగా పాల్గొంటున్నా. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా ముగ్గుల పోటీల్లో పాల్గొనేలా ఆంధ్రజ్యోతి వారు చేపడుతున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఈసారి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి కడప పేరు నిలబెడతా. మహిళల్లో దాగివున్న సృజనాత్మకతను ముగ్గుల రూపంలో తీసుకురావడం చాలా సంతోషంగా వుంది. ఈ అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు వ్యక్తం చేశారు.

శ్వేత, మొదటి విజేత, శంకరాపురం, కడప

ఆంధ్రజ్యోతి మహిళలకు ఇచ్చే కానుక



ఏటా సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి మహిళలకు ఇచ్చే కానుక ముత్యాల ముగ్గుల పోటీ. ఇతర దినపత్రికల వారు మహిళలకు పోటీలు ఏర్పాటు చేయడం మరచిపోయినా ఆంధ్రజ్యోతి వారు మాత్రం ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ తెలుగు సంప్రదాయలను కనుమరుగు కాకుండా చేస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

రమాదేవి, ద్వితీయ విజేత, లైటుపాళెం, ప్రొద్దుటూరు

వచ్చే ఏడాది ప్రథమ స్థానం సాధిస్తా



గెలుపోటములను సమానంగా తీసుకున్న వారే ఉత్తమంగా రాణిస్తారు. ప్రస్తుతం తృతీయ విజేతగా నిలవడం చాలా ఆనందంగా వుంది. వచ్చే ఏడాది ప్రథమ విజేతగా నిలవడమే లక్ష్యంగా శ్రమిస్తా

సునీత, తృతీయవిజేత, ప్రొద్దుటూరు

మొదటి ప్రయత్నంలోనే ప్రథమ బహుమతి



నేను గతంలో ఎప్పుడూ ఈ ముగ్గుల పోటీలో పాల్గొనలేదు. స్నేహితుల సలహా మేరకు.. ఈసారి పాల్గొన్నాను. ఎలాగైనా బహుమతి సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళిక ప్రకారం ఏం ముగ్గు వేయాలో నిర్ణయించుకుని ముగ్గు వేశాను. మొదటి బహుమతి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

భవాని, రాయచోటి

వచ్చే ఏడాది మొదటి బహుమతి సాధిస్తా



ఆరేళ్ల కిందట జరిగిన ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించాను. ఈసారి రెండో బహుమతితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది మొదటి బహుమతి సాధిస్తాను.

అమరావతి, రాయచోటి

నిర్లక్ష్యంతో.. మొదటి బహుమతి పోగొట్టుకున్నా



గతేడాది నాకు మొదటి బహుమతి వచ్చింది. ఈసారి కొంచెం నిర్లక్ష్యం చేయడంతో మూడో బహుమతితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది మళ్ళీ మొదటి బహుమతికి ప్రయత్నం చేస్తా.

హిమబిందు, రాయచోటి



రాజంపేట ముగ్గుల పోటీలో ప్రోత్సాహక బహుమతులు పొందిన మహిళలు

రామనపల్లెలో యువకుడి దారుణ హత్య

● పాత కక్షలా, తాత్కాలిక గొడవలా..?



గుర్రంపాటి అల్లీషేర్ మృతదేహం

చెన్నూరు, జనవరి 7: రామనపల్లెలో ఆదివారం రాత్రి గుర్రంపాటి అల్లీషేర్ (24) దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో అతన్ని గ్రామం పక్కనే ఓ మోరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి గొంతుకోసి హత్య చేశారు. గ్రామస్థుల కథనం మేరకు... అల్లీషేర్ ఆటో నడుపుతూ జీవించేవాడు. శబరిమలైకు వెళ్లి శనివారం తిరిగి ఇంటికి వచ్చాడు. అదేరోజు రాత్రి గ్రామానికి చెందిన మరో వ్యక్తితో గొడవపడ్డా డు. ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తు లతో పొడిచి గొంతుకోయడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య కడప డీఎస్పీ షరీఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన మృతదేహాన్ని పరిశీలించారు. ఈ హత్యకు గల కారణాలపై ఎస్‌ఐతో చర్చించారు. కాగా అల్లీషేర్ భార్యతో మనస్పర్థలు ఏర్పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

లారీ ఢీ - భిక్షగాడు మృతి



ఎర్రగుంట్ల, జనవరి 7: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద లారీ ఢీకొనడంతో భిక్షగాడు వెంకటేశ్ మృతి చెందాడు. రాజంపేట వాసి వెంకటేశ్ ఆదివారం సాయంత్రం నాలుగురోడ్ల కూడలి వద్ద భార్య, మరికొందరితో కలిసి నడుచుకుంటూ వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. కుడి కాలు, చేతికి కండరాలు బయటికి వచ్చాయి. కొద్దిసేపు ఆయన స్పృహలేకుండా పడిపోయాడు. తేరుకున్న తరువాత ఆయన్ను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి మృతి చెందినట్లు సమాచారం.

కారును ఢీకొన్న మోటార్‌సైకిల్

ఎర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద మోటార్‌సైకిల్ కారును ఢీకొంది. యువకుడు బైక్‌ను నడుతూ క్రాస్ చేస్తూ కారును ఢీకొనగా కిందపడ్డాడు. స్వల్ప గాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

ఓటమి భయంతో సజ్జల మాట్లాడుతున్నాడు

కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 7: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని ఓటమి భయంతోనే సజ్జల కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు పేలుతున్నాడని రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడతూ కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద సెక్యులర్ పార్టీ అని తెలిపారు. దేవంలో అత్యుత్తమ పార్టీ ద్వారానే జగన్ ఎంపీ అయిన విషయం మరచిపోయారా అంటూ హితవుచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అరణ్యవాసం ముగిసిందని, రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రం, ఇటు రాష్టంలో పూర్వవైభవం పొందుతుందన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అన్ని విభాగాల్లో వైసీపీ వైఫల్యం పొందిందని అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్ అన్నట్లు వైసీపీ పరిపాలన ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో రగలిపోతున్నారని, ఓటమి భయం పట్టుకోవడం వల్లే సజ్జల మాట్లాడుతున్నాడనే విషయం ప్రజలందరికి అర్థమవుతోందని తెలిపారు.

ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలు చిన్నాభిన్నం

● ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం పదవి ముళ్లకిరీటం
చంద్రబాబును వరించినా ఆచి తూచి వ్యవహరించాలి ● త్వరలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
● ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య



కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 7: రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా సీఎం పదవి ముళ్ల కిరీటంతో సమానమని.. ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ఆదివారం కడప నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనలో భాగస్వామ్యం కాకూడదనే ఏకైక లక్ష్యంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. తనకు ఎమ్మెల్సీ పదవి ఇంకా మూడేళ్ల కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తున్నానన్నారు. ఇప్పటి వరకు రాజకీయ విలువలు కాపాడుకుంటూ వచ్చానన్నారు. వైసీపీలో ఉన్నందుకు చాలా కాలం నుంచి అంతర్మథనం పడుతున్నానన్నారు. కొంత కాలం నుంచి మీడియాకు కూడా దూరంగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. తప్పిదాలను జగన్‌కు చెప్పేందుకు చాలా ప్రయత్నం చేశామని తెలిపారు. అయితే ఆ అవకాశం తనకు రాలేదని తెలిపారు. జగన్‌పార్టీని వీడి బయటికి వచ్చినందుకు తనను గ్రాప్ అంటున్నారని, పార్టీలో చేరమని తన ఇంటి చుట్టూ తిరిగినప్పుడు గ్రాప్ అని తెలియలేదా అని ప్రశ్నించారు. వైసీపీలో రాజకీయం ప్రజాస్వామ్యం కనిపించడం లేదన్నారు. సలహాదారులైనా సరైన సలహాలు జగనకు ఇచ్చి మారిస్తే బాగుంటుందన్నారు. వందల కోట్లు ప్రజాధనం కోర్టు కేసులకు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రూ.12 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. రాష్ట్రంలో ఆదాయం వచ్చే సెక్టారు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల కోసం కేంద్రంతో రాజీ పడి రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులను వదులుకుంటున్నారని తెలిపారు. సాధికారత సభలు నిర్వహిస్తే ఏం లాభమని ప్రశ్నించారు. ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌ను తిట్టాడని... పోలీసులకు ఫిర్యాదు

బి.కోడూరు, జనవరి 7: పాత విద్యుత్ బిల్లు కట్టమని అడిగినందుకు లైన్‌మెన్ సుబ్బరాయుడును యడవల్లి గురుప్రసాద్ తిట్టాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిల్లు కట్టమని అడగడంతో మేం కట్టం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అని దుర్భాషలాడి అవమానపరిచి బెదిరించి సెల్‌ఫోను లాక్కున్నాడని పోరుమామిళ్ల ఏడీ నాయక్‌కు జరిగిన విషయం తెలిపారు.

దీంతో ఆయన బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడని, కులం పేరుతో దూషించాడ ని అతనిపై విచారించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు లైన్‌మెన్ సుబ్బరాయుడు తెలిపారు.

10, 11 తేదీల్లో కేంద్ర కర్మచారీ సభ్యుడు రాక

కడప(కలెక్టరేట్) జనవరి 7: కేంద్ర సఫాయి కర్మచారీస్ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వవ ఈనెల 10, 11 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు నుంచి బయలు దేరి రాత్రి 8 గంటలకు కడపకు చేరుకుని.. రాత్రికి బసచేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్‌తో కలసి సంబంధిత అధికారులు, కర్మచారీస్‌లతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్లో కలెక్టర్, ఎస్పీలతో కలిసి సంబంధిత జిల్లా అధికారులు, సఫాయి కర్మచారీస్‌తో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం తిరుపతికి వెళతారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి 36గంటల ధర్నా జయప్రదం చేయండి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 7: ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ పొదుపు సొమ్మును ప్రభుత్వం తమ అవసరాలు తీర్చడంలో విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. రాష్ట్రంలో 36గంటల ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ తాలుకా స్థాయిలో ఆరుగంటల ధర్నా, జిల్లాస్థాయిలో 12గంటల ధర్నా నిర్వహించామన్నారు. ప్రభుత్వంలో స్పందన లేకపోవడం సిగ్గుచేటన్నారు.

ప్రజా ఆగ్రహంలో వైసీపీ కొట్టుకుపోతుంది : ప్రవీణ్‌రెడ్డి



సాయికుటీర్ రోడ్డు ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,జనవరి 7 : రాక్షసపాలనపై ప్రజల్లో వున్న ఆగ్రహంతో వైసీపీ కొట్టుకుపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం 3 వార్డు సాయికుటీర్‌రోడ్డు ప్రకాష్‌నగర్‌లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మేనిఫెస్టో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, తాటి శ్రీనివాస్ యాదవ్, పొట్టిపాడు గంగాధర్, కోటశ్రీదేవి,పల్లా లక్ష్మీదేవి , సుబ్రహ్మణ్యం రాజు, రాజా ,రాము, దొంతి కిరణ్‌కుమార్, కోగటం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సొంతజిల్లాకు చేసిందేమీలేదు : భూపేశ్‌రెడ్డి



మాలేపాడులో జరిగినబాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భూపేష్‌రెడ్డి, సీఎం.సురేష్‌నాయుడు

ఎర్రగుంట్ల, జనవరి 7: జగన్‌మోహన్‌రెడ్డి సొంతజిల్లాకు కూడా చేసిందేమీలేదని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సీ.భూపేశ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం ఎర్రగుంట్ల మండలంలోని మాలేపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకుడు సీఎం.సురేష్ నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సి.జయరామి రెడ్డి, మాలేపాడు టీడీపీ నాయకుడు మేకల మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కే.మోహన్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వీరేంద్రరెడ్డి, బసిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● గ్రామానికి చెందిన మేకల ఈశ్వరరెడ్డి, గుళ్లదుర్తి రవీంద్రారెడ్డి, సుబ్బయ్య తదితరులతో కూడిన పది కుటుంబాలు భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

మహిళలు ఆధ్యాత్మిక శక్తి పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న శ్రేయానంద సరస్వతి

పోరుమామిళ్ల, జనవరి 7 : మహిళలు ఆధ్యాత్మిక శక్తి పెంపొందించుకోవాలని చిన్మయానంద మిషన్ మాతాజీ శ్రేయానంద సరస్వతి అన్నారు. ధనుర్మాస దీక్షలో భాగంగా పోరుమామిళ్లలో ఆదివారం 400 మంది మాతృమూర్తులతో గిరినగర్‌లోని రామాలయం నుంచి పురవీధుల గుండా అమ్మవారిశాల వరకు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిశాలలో సమావేశమైన మాతృమూర్తులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు గంటా గురులక్ష్మి, రత్నమ్మ, రామలక్ష్మి, నారాయణమ్మ, రాజేశ్వరి, రత్న ప్రభ, మహాలక్ష్మి ఆర్యవైశ్య మహిళా మండలిఅధ్యక్షులు క్రిష్ణవేణి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్మాకు బెదరం..!

జీవో నెంబరు 2 ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు

ప్రొద్దుటూరు, జనవరి 7 : తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఎస్మాలాంటి చట్టాలను ప్రయోగిస్తే బెదిరిపోమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి హెచ్చరించారు. ఆదివారం ఎస్మా చట్టం జీవో కాపీలను తహసీల్దారుకార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రారామాంజనేయులు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌నేతలు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు





ప్రొద్దుటూరులో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

మైదుకూరు..: ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఎం జగన్‌ను కోరుతున్నా ఆయన పట్టించుకోవడం లేదని నీవే జగన్ మనస్సు మార్చాలమ్మా అంకాలమ్మా అంటూ ఆదివారం అమ్మవారికి బోనాలు పట్టి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ 27 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. తాజాగా ఆదివారం అంగన్వాడీ కార్యకర్తలు ఎర్రచీరలు కట్టుకొని అమ్మవారికి బోనాలు పట్టి దీక్ష శిబిరం వద్ద నుంచి రాయల్ కూడలి, పొట్టిశ్రీరాముల సర్కిల్ మీదుగా అంకాలమ్మ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్‌లతో కూడిన పత్రాలను బోనాలకు కట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, శ్రీరాములు, ఏవీ శివరాం, షావలి, షరీఫ్, జహంగీర్,అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: జీవో నెం.2ను ప్రతులను నిరసిస్తూ ఆదివారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు జీవో నెం.2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, అంగన్వాడీ నాయకులు సుభాషిణి, హుసేనమ్మ, కళావతి, సత్యవతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అంగన్వాడీల సమ్మెపై జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపి జీవో కాపీలను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెన్నయ్య, మండల కార్యదర్శి ఈశ్వర్, సభ్యులు ఓబులాపురం విజయమ్మ, రమణారెడ్డి, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు వినోదా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జగన్ మాయమాటలు రాష్ట్రంలో ఇంకెవ్వరూ నమ్మరని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు విమర్శించారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, ఏఐటీయూసీ, డీవైఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం : వరద



ప్రొద్దుటూరు ,జనవరి 7 : అంగన్ వాడీలకు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారు చేస్తున్న సమ్మెపై ఎస్మా లాంటి చట్టాన్ని ప్రయోగించటం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విమర్శించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీల ఆర్తనాదాలు అర్థం చేసుకోకుండా ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వంలో ఎవ్వరి సలహాలు వినని ముఖ్యమంత్రి తన సలహాదారులకు అనవసరంగా లక్షల జీతాలు ఎలా ఇస్తున్నారన్నారు.అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలివ్వమని ఉద్యమిస్తే వారిపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు.వారికి మద్దతుగా టీడీపీ ఉద్యమిస్తుందన్నారు.

సజ్జల దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి -వరదరాజులరెడ్డి

షర్మిలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని సజ్జల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తీవ్రంగా విమర్శించారు.

ఉపకార వేతనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపకార వేతనాలు, షీల్డులు పంపిణీ చేస్తున్న స్వామీజీ

మైలవరం, జనవరి 7 :తొగటవీర క్షత్రీయ నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులు ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వేపరాల గ్రామంలోని సీతారామ కళ్యాణ మండపంలో రాయలసీమస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు 100 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత తొగటవీర క్షత్రియ కుల గురువు దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు పల్లా శేషయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించాల చంద్రమౌళి, గ్రామ సర్పంచ్ పల్లా శ్రీదేవి, మాజీ సర్పంచ్ కొండయ్య, సంఘ నేతలు లక్ష్మీనారాయణ, అలిశెట్టి కుమార్, సుబ్బయ్య, శంకరయ్య, ధనుంజయ, గంజికుంట తిరుమల దాసు, చౌడం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

ప్రొద్దుటూరు ,జనవరి 7 : బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని క్రిమీలేయర్ విధానాన్ని రద్దుచేయాలని బీసీ ఉద్యోగులసంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘంనేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగు సంఘంనేతలు చంద్రమౌళి, కొత్తపల్లె శీను, అశోక్‌కుమార్, రామారావు,శివప్రతాప్, వేల్పుల భాస్కర్ రామసుబ్బయ్య, రవిశంకర్, వరప్రసాద్ వేణుగోపాల్ బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రారామాంజేయులు తదితరులు పాల్గొన్నారు.

సగరులు రాజకీయాల్లో రాణించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 : సగరులు రాజకీయాల్లో రాణించాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ పేర్కొన్నారు. ఆదివారం సగర సంఘం సమావేశం సాయి రైస్ మిల్లులో నిర్వహించారు. ఇటీవల మధ్య ప్రదేశ్‌లో జరిగిన 67వ జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలో 8వ స్థానంలో నిలిచిన ఈనెపాటి సుమంత్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు బాలగంగాధర్ తిలక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బారావు జ జోడు ప్రసాద్, శ్రీరాములు, సుబ్బరాయుడు, వెంకటేశు, సురేష్, వెంకటసుబ్బయ్య, నాగన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 7 : బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నేత్ర వైద్యుడు గురు అభిలాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి శీను బీసీ ఉద్యోగుల సమస్యలపైన చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు చంద్ర మౌళి, కార్యదర్శి అశోక్, కోశాధికారి రామారావు, ఉపాధ్యక్షుడు భాస్కర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి చరమగీతం పాడండి : రోశన్న




ఉద్దికట్ట వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, జనవరి 7 : వైసీపీ పాలనకు చరమగీతం పాడి టీడీపీకి స్వాగతం పలకాలని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోరుమామిళ్లలో ఉద్దికట్ట, శీనప్పబావివీధి, శివాలయంవీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఉద్దికట్ట వీధిలో ఉపాధి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, సీతా బాలాజీ, ఇమాంహుసేన్, అతికారిరాజా, షరీఫ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. కాగా చంద్రబాబు రూపొందించిన కరపత్రాలను బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణ రాజీ, టీడీపీ పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి హబీబున్నీసా ప్రచారం నిర్వహించారు. ఆదివారం వారు పోరుమామిళ్లలోని 13, 14, 59, 60బూత్‌ల పరిధిల్లో ఉన్న వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పథకాలను మహిళలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. నాయకులు మస్తాన్, అన్వర్, గఫార్ పాల్గొన్నారు.

'ఎస్మా ప్రయోగం దారుణం'

బద్వేలు, జనవరి 7: రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత కార్మికులు సమ్మె చేస్తుంటే పట్టించుకోని సీఎం అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగం చేయడం దుర్మార్గ చర్య అని సీపీఐ జిల్లా కార్యవర్గ వీరశేఖర్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్ రాజు, పట్టణ కార్యదర్శి బాలు, దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, పెంచలయ్య, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమితి మాజీ అధ్యక్షుడు హృషికేశవరెడ్డి మృతి



జమ్మలమడుగు ,జనవరి 7 : జమ్మలమడుగు పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నేత, సమితి మాజీ ప్రెసిడెంట్ తాతిరెడ్డి హృషికేశవరెడ్డి (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సమితి అధ్యక్షుడుగా 1978-1983 వరకు కొనసాగారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించటంతో హైదరాబాదుకు తరలించారు. హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారని కుటుంబసభ్యులు తెలిపారు.

నియోజకవర్గం ఖాజీపేట వైపు చూస్తోంది : పుట్టా

కొత్తపేటలో వైసీపీ నుంచి టీడీపీలోకి 70 కుటుంబాలు చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కొత్తపేట గ్రామస్థులు

ఖాజీపేట, జనవరి 7 : నియోజకవర్గం ఖాజీపేట వైపు చూస్తోందని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపేటలో పోకల వెంకటసుబ్బారెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొత్తపేట గ్రామస్థులు మాట్లాడుతూ కొత్తపేట బూత్‌లో వైసీపీకి ఒక్క ఓటు మెజార్టీ తెచ్చుకుంటే మేము రాజకీయాలు మానుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరమణమ్మ, విష్ణు యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, బాలిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, చిన్నపురెడ్డి, ఖాజీపేట నాయకులు ఫరూక్, జిలానీ, ప్రతాప్‌రెడ్డి, సుబ్బయ్య, పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

కలసపాడు, జనవరి 7 : టీడీపీ గెలిపించాలని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న తెలిపారు. ఆదివారం కలసపాడు మండలం ఎగువ రామాపురం గ్రామంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ సాధనకారిరంతు, మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఎనుముల వెంకటరెడ్డి, బసిరెడ్డి వీరారెడ్డి, రసూల్, నర్రా వెంకటశివారెడ్డి, నారాయణరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

వనంపులలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్

బద్వేలు, జనవరి 7: బద్వేలు మండలంలోని వనంపుల, నందిపల్లె గ్రామంలో ఆదివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవి కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ మణ్యం రామిరెడ్డి, సాంబ శివారెడ్డి, వీరారెడ్డి, నారాయణరెడ్డి, నరసారెడ్డి, వీరభద్ర, ఓబులేసు, ఈశ్వరయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రొద్దుటూరు ,జనవరి 7 : న్యాయసమ్మతమైన మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించి సమ్మెకు ప్రభుత్వం ముగింపు పలకాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చంటి, సాల్మన్ డిమాండ్ చేశారు. ఆదివారంనాటికి మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 13 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యాలయం ముందు మానవహారంగా ఏర్పడి తమ డిమాండ్లపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కోశాధికారి రాఘవ, సహాయ కార్యదర్శులు మోహన్, ఉపాధ్యక్షులు గుర్రమ్మ, రమాదేవి, ప్రమీళమ్మ, సీతమమ, అన్నపూర్ణ, లంకరవి, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: సమానపనికి సమానవేతనం ఇవ్వాలని ఎర్రగుంట్లనగరపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ఆదివారం ఉదయం ఎర్రగుంట్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు బైఠాయించి తమ నిరసనను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలన్నారు వారు డిమాండ్ చేశారు.

కార్మికుల సమ్మెను జటిలం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

బద్వేలు..: మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నానాటికి సమ్మె జటిలమవుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పురపాలక సంఘ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా నిల్చున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, గంటా శ్రీనివాసులు, కోశాధికారి కాలువ శివకుమార్, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఆదివారం బద్వేలు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం ఎదుట ఒంటికాలితో మా గోడును వినేందుకు రెండు చేతులు జోడించి వినూత్నరీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈ. నాగేష్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రమణారావు, దేవసహాయం, శ్రీను, నర్సయ్య, పుల్లమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఆదివారం కూడా కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట సుబ్బయ్య, కళ్యాణ్, చిన్న ఓబులేసు ఆదినారాయణ, బండి రాజ, చెండ్రాయుడు, పాపారాయుడు, నాగయ్య తదితరులు పేర్కొన్నారు.

జమ్మలమడుగు..: మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయమైనదని వారిక కనీస వేతనాలు పెంచాలని టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్టాండువద్ద మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు భూపేష్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు విజయ్, సీపీఎం నాయకులు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో ఒంటి కాలిపై కార్మికుల నిరసన



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన...



బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో కార్మికుల మానవహారం



మైదుకూరులో ఆందోళన చేస్తున్న చేస్తున్న కార్మికులు



జమ్మలమడుగులో మద్దతు తెలుపుతున్న భూపేశ్‌రెడ్డి